సాక్షి కామారెడ్డి

మంగళవారం । 6 । మే । 2025



ఆదర్శ బడులు

అన్నాసాగర్ జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో వరుసగా తొమ్మిదోసారి వంద శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది.

- 8లో ▸



సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 42.1 /19.4

వాతావరణం

ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులకు సన్మానం



కామారెడ్డి క్రైం : బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం తన చాంబర్‌లో సన్మానించారు. విద్యార్థులు బామన్ రమేష్, పైడి మౌర్యానంద్ రెడ్డి, శ్రీ చైతన్య, మంజ్యా శివ, గాదె అనిరుధ్, రక్షితలను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కొనుగోళ్లను వేగవంతం చేయాలి'



రామారెడ్డి: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఐకేపీ డీపీఎం రమేష్‌బాబు సూచించారు. రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి, మోషంపూర్‌లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రామారెడ్డిలో స్టిచ్చింగ్ సెంటర్‌ను పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రైతులు అధైర్యపడొద్దు'



బీబీపేట: అకాల వర్షాలతో తడిసిపోయిన ప్రతి గింజను సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడొద్దని డీఆర్‌డీవో సురేందర్ పేర్కొన్నారు. సోమవారం ఉప్పర్‌పల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని ఐకేపీ డీపీఎం రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్లను కొనుగోలు చేసిన వెంటనే త్వరగా ట్యాబ్ ఎంట్రీ చేయాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున వడ్లపై కవర్లను కప్పి ఉంచుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏపీఎం బాలపోచయ్య, సీసీలు బాల్‌చంద్రం, నవీన్, శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

'దోస్త్' కోసం హెల్ప్‌లైన్ సెంటర్

కామారెడ్డి అర్బన్: దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) రిజిస్ట్రేషన్‌లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దోస్త్‌కు తాను జిల్లా హెల్ప్‌లైన్ సెంటర్ చైర్మన్‌గా, అధ్యాపకుడు విశ్వప్రసాద్ సమన్వయకర్తగా, అనిల్ కృష్ణ, అజారుద్దీన్ సహాయకులుగా ఉంటారని పేర్కొన్నారు. దోస్త్‌లో ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర రాష్ట్రాల విద్యార్థుల మార్కుల జాబితా, మొబైల్ నంబర్లు తదితర అంశాలపై తలెత్తే సమస్యలను గ్రీన్ చానల్ ద్వారా వెంటవెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

ఆర్ట్స్ కళాశాలను ఎంపిక చేసుకోండి

విద్యార్థులు డిగ్రీలో ప్రవేశం కోసం కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ కోరారు. తమ కళాశాలలో రాష్ట్రంలో ఎక్కడా లేని ప్రత్యేక కోర్సులున్నాయన్నారు. ఇక్కడ చదివినవారు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్ వన్ అధికారులుగా, ప్రొఫెసర్లుగా, అధ్యాపకులుగా, ఆర్మీ, పోలీస్, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ రంగాలలో మంచి స్థానాలలో ఉన్నారని పేర్కొన్నారు. కళాశాలలో చేరాలని విద్యార్థులను కోరారు.

15 లోగా దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ప్రవేశ పరీక్ష కోసం ఈనెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. వచ్చేనెల 25న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

■ కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని నర్సన్నపల్లికి చెందిన కవిత (44) హత్యకు గురైంది. బాకీ డబ్బులు అడిగినందుకు మహేశ్ అనే నేరస్తుడు హత్య చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. గతంలో ఓ హత్య కేసులో మహేశ్ జైలుకు వెళ్లాడు. బెయిల్ కోసం కుటుంబ సభ్యులు కవిత దగ్గర అప్పు తీసుకున్నారు. ఆ అప్పు తిరిగి చెల్లించాలని అడిగినందుకు కవితను హత్య చేసినట్టు నిందితుడు నేరం అంగీకరించాడు.

■ లింగంపేట మండల కేంద్రంలో లక్ష్మి (45) హత్యకు గురైంది. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న లక్ష్మి మెడలో ఉన్న నగలపై కన్నేసిన గారబోయిన శ్రీకాంత్ అనే వ్యక్తి ఆమెకు చీరతో ఉరివేసి చంపాడు. మెడలోని బంగారు ఆభరణాలు, నగదు తీసుకుని పారిపోయాడు. పోలీసులు విచారణ జరిపి నిందితుడిని అరెస్టు చేశారు.

జిల్లాలో ఇటీవలి కాలంలో హత్యల పరంపర కొనసాగుతోంది. సగటున వారానికో హత్య జరుగుతోంది. చాలా కేసుల్లో అయిన వారే హంతకులుగా తేలుతున్నారు. కొన్ని సంఘటనల్లో నగలు, నగదుకోసం, మరికొన్ని సంఘటనలు వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరుగుతున్నట్టు తెలుస్తోంది.



నగలు, నగదు కోసం కొన్ని..

- వివాహేతర సంబంధాల నేపథ్యంలో మరికొన్ని..
- సమాజంలో పెరుగుతున్న నేర ప్రవృత్తి
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు

వారానికో హత్య!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నేరస్తులకు శిక్షలు పడుతున్నా సమాజంలో నేర ప్రవృత్తి తగ్గడంలేదు. పైపెచ్చు మరింతగా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 1 వరకు జిల్లాలో 16 హత్యలు జరిగాయి. అంటే వారానికొక హత్య జరిగినట్లు స్పష్టమవుతోంది. గతేడాది కూడా వారానికొకరు అన్నట్టుగానే 47 మంది హత్యకు గురయ్యారు. కొన్ని సంఘటనల్లో నిందితులు ఎలాంటి క్లూ దొరక్కుండా జాగ్రత్త పడ్డా.. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ హత్య కేసులను తేలుస్తున్నారు. కొన్ని కేసుల్లో ఒకటి రెండు రోజుల్లోనే నేరస్తులు చిక్కుతున్నారు. కొన్ని హత్యలు వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగినట్టు స్పష్టమవుతుండగా, మరికొన్ని నగలు, నగదు, ఆస్తి వంటి విషయాల్లో జరుగుతున్నాయి. కాగా కొన్ని కేసుల్లో కుటుంబ సభ్యులు, రక్త సంబంధీకులే హంతకులుగా తేలుతున్నారు. ఇటీవల మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం) గ్రామానికి చెందిన కుమార్ అనే యువకుడిని ఫరీదుపేట శివారులో వెంబడించి ఇనుపరాడ్లు, గొడ్డలితో దాడి చేసి చంపడానికి ప్రయత్నించారు. ఆ సమయంలో రోడ్డు మీదుగా వెళ్లేవారు గమనించడంతో దాడి చేసిన వ్యక్తులు పారిపోయారు. తీవ్ర గాయాలపాలైన కుమార్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ కేసును విచారించిన పోలీసులు బాధితుడి భార్యనే కుట్రదారుగా తేల్చారు. సుపారీ ఇచ్చి భర్త హత్యకు కుట్ర పన్నినట్టు తేల్చి భార్యతో పాటు పలువురు నిందితులను హత్యాయత్నం కేసులో అరెస్టు చేశారు. ఇలాంటి సంఘటనలు సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. వివాహేతర సంబంధాలు, ఆస్తి తగాదాల్లోనే ఎక్కువగా హత్యలు జరుగుతున్నాయి. అలాగే నగలు, నగదు కోసం కూడా హత్యలకు పాల్పడుతున్నారు.


రోడ్డున పడుతున్న కుటుంబాలు..

హత్యలతో బాధిత కుటుంబాలతో పాటు నేరానికి పాల్పడిన వారి కుటుంబాలు కూడా రోడ్డున పడుతున్నాయి. ఇంట్లో ఎవరో ఒకరు హత్యకు గురైనపుడు వారి కుటుంబానికి తీరని వేదన మిగులుతోంది. ఇదే సమయంలో హత్యానేరంతో జైలుకు వెళ్లిన వ్యక్తి కుటుంబం కూడా రోడ్డున పడుతోంది. హంతకుడి కుటుంబంగానే చూస్తుంటారు. దీంతో హత్య కేసులో అరెస్టయిన వారి కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. బయట ఎవరూ దగ్గరకూ రానివ్వని పరిస్థితి ఉంటోంది. హత్య కేసులో జైలుపాలైన వ్యక్తిని బెయిల్‌పై తీసుకురావడానికి కొన్ని సందర్భాల్లో పూచీకత్తు ఇవ్వడానికి కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో వారి కుటుంబాలు అనేక ఇబ్బందులపాలు కావలసి వస్తోంది.

శిక్షలు పడుతున్నా..

ఇటీవలి కాలంలో హత్య కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడుతున్నాయి. నేర పరిశోధనల్లో పోలీసులు సాంకేతికతను వాడుకుంటూ టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించి కోర్టుల ముందుంచుతున్నారు. దీంతో నేరస్తులు తప్పించుకునే అవకాశం దొరకడం లేదు. దీంతో కేసులో నేరం నిర్ధారణ జరిగి శిక్షలు విధిస్తున్నారు. హత్య కేసు నమోదైనపుడు బెయిల్ లభించేందాకా జైలులో ఉండాల్సిందే. ఒక్కోసారి రెండు, మూడు నెలలు కూడా బెయిల్ దొరకదు. నేరం నిరూపణ అయిన తరువాత పడే శిక్షలతో ఏళ్లకు ఏళ్లు జైళ్లో గడపాల్సిన పరిస్థితుల్లో నేరస్తులతో పాటు వారి కుటుంబ సభ్యులూ వేదనకు గురి కావలసిన పరిస్థితి ఉంటుంది. ఇంత జరుగుతున్నా నేరాలు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

స్వల్పంగా కంపించిన భూమి



కామారెడ్డి అర్బన్/మాచారెడ్డి: జిల్లాలోని పలు ప్రాంతాలలో భూమి స్వల్పంగా కంపించింది. కామారెడ్డి పట్టణంతోపాటు మాచారెడ్డి మండలంలోని సోమారంపేటలో సోమవారం సాయంత్రం భూకంపం వచ్చిందని ప్రజలు తెలిపారు. భూమి లోపలనుంచి పెద్దగా శబ్దాలు వచ్చాయని, భూమి కదిలినట్లు అనిపించిందని పేర్కొన్నారు. దీంతో ఇళ్లలోనుంచి బయటికి పరుగులు తీశామన్నారు. జిల్లా కేంద్రంలో భూకంపం వచ్చిన సమయంలోనే ఆకాశంలో ఉరుములు, మెరుపులు వచ్చాయి.

నిజామాబాద్ జిల్లాలో..

సిరికొండ/మోర్తాడ్ : నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించిందని ప్రజలు తెలిపారు. సిరికొండ మండల కేంద్రంతోపాటు మైలారం, నర్సింగ్‌పల్లి, చీమన్‌పల్లి, చిన్నవాల్గోట్, రావుట్ల, కుర్దుల్‌పేట్, హుస్సేన్‌నగర్‌లతోపాటు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్, మెండోరా మండల కేంద్రాల్లో స్వల్పంగా భూమి కంపించిందని పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం భీమ్‌గల్, మెండోరా మండలాల్లో భూమి కంపించిన విషయం తెలిసిందే.

ఏడాదికి ఒకసారే..



మద్నూర్‌లోని రథ్‌గల్లీలో నిర్వహిస్తున్న అంగడి

ఎక్కడైనా వారానికోసారి అంగడి (వారసంత) నిర్వహిస్తుంటారు. ఇది సర్వసాధారణం.. కానీ మద్నూర్ మండల కేంద్రంలోని రథ్‌గల్లీలో మాత్రం సంవత్సరానికి ఒక్కసారే సంత నిర్వహిస్తారు. ఇదే ఈ సంత స్పెషల్.. ఏటా వైశాఖ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే సోమవారం ఇక్కడ సంత జరుగుతుంది. ఎందుకంటే రథ్‌గల్లీ నుంచి ఏటా వైశాఖ పౌర్ణమి రోజు రథోత్సవం నిర్వహిస్తారు. స్థానిక లక్ష్మీ నారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు, జాతర, కుస్తీ పోటీలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ నేపథ్యంలో రథ పౌర్ణమికి ముందు వచ్చే సోమవారం గాంధీ చౌక్‌లో సంత నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం సంత జరిగింది. ప్రజలు తమకు అవసరమైన సరుకులు కొనుగోలు చేశారు.

– మద్నూర్

9 మంది హౌసింగ్ ఏఈల నియామకం

కామారెడ్డి క్రైం: జిల్లాకు తొమ్మిది మంది హౌసింగ్ ఏఈలను కేటాయించారు. వారంతా సోమవారమే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో నూతనంగా నియమితులైన ఏఈలకు కలెక్టర్ వారు పని చేయాల్సిన మండలాలను కేటాయించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించాలని, నిబంధనల ప్రకారం పథకం అమలయ్యేలా చూడాలని సూచించారు.

ప్రారంభానికి సిద్ధం



కామారెడ్డిలో పూర్తయిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం

జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్వార్టర్ ఎదురుగా చేపట్టిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కార్యాలయంలో కావలసిన అన్ని ఏర్పాట్లు చేశారు. దశాబ్దాల పాటు ఎన్జీవోస్ కాలనీలోని అద్దెభవనంలో కార్యాలయం కొనసాగింది. రెండేళ్ల క్రితం పాతరాజంపేటలోని గ్రామ పంచాయతీ భవనంలోకి రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని మార్చారు. నూతన భవన నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభించడమే మిగిలి ఉంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి


మాతాశిశు సంరక్షణ కార్డుల కొరత

- 7 నెలలుగా నిలిచిన సరఫరా
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు, వైద్యులు

బిచ్కుంద : మహిళలు గర్భందాల్చినప్పటి నుంచి బిడ్డకు ఐదేళ్లు వచ్చేవరకు ఇచ్చే టీకాలు, ఎదురైన ఆరోగ్య సమస్యలు, వైద్య పరీక్షల వివరాలను నమోదు చేయడం కోసం ప్రభుత్వం మాతాశిశు సంరక్షణ సమాచార కార్డులను అందిస్తుంది. కానీ జిల్లాలో ఏడు నెలలుగా ఈ కార్డుల సరఫరా లేదు. దీంతో గర్భిణులు, వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. ఏడు నెలలుగా కార్డులు లేకపోవడంతో గర్భిణులకు అందించిన వైద్య సేవల వివరాలు తెలుసుకోలేకపోతున్నారు.

కార్డులు ఎందుకంటే..

మాతాశిశు సంరక్షణ కార్డులతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. మహిళలు ముందుగా అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం వద్దకు వెళ్లి గర్భందాల్సిన తేదీ, నెల నమోదు చేసుకోవాలి. వారు వివరాలు నమోదు చేసుకున్న వెంటనే మాతా శిశు సంరక్షణ కార్డు అందిస్తారు.



అందులో గర్భిణి పేరు, ఆధార్ కార్డు, ప్రతి నెల వైద్య పరీక్షలు చేసిన వివరాలు, హిమోగ్లోబిన్ శాతం, బీపీ, మూత్ర పరీక్షలు, బరువు, ఎత్తు, అంగన్‌వాడీ ద్వారా తీసుకుంటున్న పౌష్టికాహారం, బిడ్డ ఎదుగుదల చెప్పే స్కానింగ్ రిపోర్టుల వివరాలు నమోదు చేస్తారు. అలాగే జన్మించిన బిడ్డకు 5 ఏళ్ల వయస్సు వరకు ఇవ్వాల్సిన టీకాలతోపాటు ఇతర వివరాలుంటాయి. గర్భిణులకు ఈ కార్డు ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయి. ఇన్ని ఉపయోగాలు ఉన్న కార్డులను అందించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొందరు గర్భిణులు కార్డు జిరాక్స్‌లు తీసుకొని వివరాలు నమోదు చేయించుకుంటున్నారు. మాతా శిశు సంరక్షణ బుక్‌లెట్ కార్డు జిరాక్స్ కోసం 150 రూపాయలు తీసుకుంటున్నారని పలువురు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 14,800 మంది గర్భిణులు ఉన్నారు. మాతాశిశు సంరక్షణ కార్డులు లేవన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని పీహెచ్‌సీల వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం కార్డులను పంపించగానే పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లకు పంపిస్తామంటున్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్పందించి కార్డులు తెప్పించి గర్భిణులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

- ముగిసిన గడువు
- 30 శాతం కూడా స్పందించని దరఖాస్తుదారులు

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే!



కామారెడ్డి టౌన్ : అక్రమ లేఅవుట్లు, అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకోసం దరఖాస్తుదారుల నుంచి స్పందన అంతంతమాత్రంగానే వచ్చింది. ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ అవకాశం కల్పించినా దరఖాస్తుదారులు పెద్దగా పట్టించుకోలేదు. మూడు బల్దియాల పరిధిలో 20,500 దరఖాస్తులు రాగా.. 5,166 మంది మాత్రమే స్పందించారు.

ఎల్ఆర్ఎస్ కోసం 2020లో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు సంబంధించి ఎల్ఆర్ఎస్ కోసం 20,500 దరఖాస్తులు వచ్చాయి. ఆ భూములను క్రమబద్ధీకరించడం కోసం ప్రభుత్వం మార్చిలో 25 శాతం రాయితీ కల్పిస్తూ ఎల్ఆర్ఎస్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఆ గడువు మార్చి నెలాఖరుతో ముగిసినా దరఖాస్తుదారులు పెద్దగా స్పందించలేదు. దీంతో ప్రభుత్వం గడువును రెండోసారి పొడిగించింది. ఏప్రిల్ 30 వరకు గడువు ఇచ్చినా ఫలితం లేకపోయింది. చివరిసారిగా ఈనెల 3వ తేదీ వరకు గడువును పొడిగించినా నామమాత్రపు స్పందనే వచ్చింది. గడువు ముగిసే నాటికి 5,166 మంది ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించారు. ఇందులో 1,755 దరఖాస్తులను పరిష్కరించి క్రమబద్ధీకరిస్తూ ప్రొసిడింగ్ పత్రాలను అందజేశారు. ఎల్ఆర్ఎస్ ద్వారా మూడు బల్దియాలకు కలిపి రూ. 12.16 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది.

మున్సిపాలిటీల వారీగా వచ్చిన దరఖాస్తులు, ఫీజుల వివరాలు..

మున్సిపాలిటీ	కామారెడ్డి	బాన్సువాడ	ఎల్లారెడ్డి	మొత్తం
దరఖాస్తులు	17,687	1,903	910	20,500
ఫీజు చెల్లించినవారు	4,580	347	239	5,166
ఆదాయం (రూ.లలో)	10.88 కోట్లు	90 లక్షలు	38 లక్షలు	12.16 కోట్లు

క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాం



దరఖాస్తుదారులందరికి ఫోన్‌ల ద్వారా సమాచారం ఇచ్చాం. అయినా ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. గడువు లోపు ఫీజు చెల్లించిన వారి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ, పరిష్కరిస్తున్నాం.

–గిరిధర్, టీపీవో, కామారెడ్డి

స్పందన ఎందుకు లేదంటే..

ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ అవకాశం ఇచ్చినా దరఖాస్తుదారులు ఎందుకు స్పందించడం లేదోన్న విషయమై అధికారులు ఆరా తీస్తున్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో ఎల్ఆర్ఎస్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నవారిలో చాలామంది ఆ ప్లాట్లను ఇతరులకు అమ్ముకున్నట్లు తెలుస్తోంది. మరికొందరు విస్తీర్ణం తక్కువగా ఉన్న ప్లాట్లలో ఎల్ఆర్ఎస్ లేకున్నా నిర్మాణాలు చేసుకున్నారు. మరికొంత మంది ఆర్థిక సమస్యలతో ఫీజు కట్టడానికి ముందుకు రాలేకపోయారు. ఇంకొందరు ప్లాట్లలో ఇల్లు కట్టుకునే ఉద్దేశం లేదని, వాటిని ఎప్పటికైనా ఇతరులకు విక్రయించేదే కదా అన్న ఉద్దేశంతో ఎల్ఆర్ఎస్‌కు ముందుకు రాలేదని తెలుస్తోంది. రియల్ ఎస్టేట్ దందాలో స్తబ్ధత నెలకొనడంతోనూ ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్పందన లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఫార్మర్ రిజిస్ట్రీ ప్రారంభం



పాతరాజంపేటలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం ప్రారంభిస్తున్న ఏడీఏ

కామారెడ్డి రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఫార్మర్ ఐడీ' ప్రాజెక్టు అమలులో భాగంగా సోమవారం చినమల్లారెడ్డి క్లస్టర్ పరిధిలోని పాతరాజంపేటలో రైతుల నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా కామారెడ్డి ఏడీఏ అపర్ణ మాట్లాడుతూ ప్రతి రైతు నుంచి వివరాలు సేకరించి ప్రత్యేక డిజిటల్ కార్డులను జారీ చేస్తామన్నారు. భవిష్యత్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే రైతు సంక్షేమ పథకాలకు ఈ కార్డు ప్రామాణికం కానుందన్నారు. రైతులందరూ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ బక్కన్నగారి రాజు, రైతులు నరేష్, రాజయ్య, లక్ష్మణ్, బాల్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజావాణికి అధికారులు డుమ్మా


ప్రజావాణిలో ఉన్న ఇద్దరు అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి తహసీల్దార్ సవాయిసింగ్, వ్యవసాయశాఖ ఏవో నవ్య హాజరయ్యారు. మిగితా ఎంపీడీవో అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరితో పాటు వివిధశాఖల అధికారులు ప్రజవాణికి గైర్హాజరయ్యారు.

నేడు, రేపు కోర్టు విధులకు దూరంగా న్యాయవాదులు

కామారెడ్డి టౌన్: హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ ప్రియదర్శిని, కామారెడ్డి సీనియర్ న్యాయవాది మోహనరావుల మృతికి సంతాపంగా జిల్లా కోర్టులో మంగళవారం, బుధవారం విధులకు దూరంగా ఉంటున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నంద రమేష్,సురేందర్‌రెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం బార్ అసోసియేషన్ భవనంలో జరిపే సంతాప సభకు న్యాయవాదులు హాజరుకావాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కళా బృందం

రాజంపేట : మండల కేంద్రంలో సోమవారం కామారెడ్డి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, సైబర్ క్రైం నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై పుష్పరాజ్, కళాజాత బృందం సభ్యులు తిరుపతి, ప్రభాకర్, శేషారావ్, సాయిలు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలను వేయించాలి


టీకాను వేస్తున్న వైద్యుడు రమేశ్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల పశువైద్యాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని కరడ్‌పల్లి గ్రామంలో సోమవారం ఆవులు, గేదెలకు గాలికుంటూ నివారణ టీకాలను వైద్య సిబ్బంది వేశారు. కార్యక్రమంలో పాలకేంద్రం అధ్యక్షుడు నారాయణరెడ్డి, వీఎల్‌వో పోచయ్య, జేవీవోలు కొండల్‌రెడ్డి, ప్రేంసింగ్, గోపాల మిత్రలు మహిపాల్‌రెడ్డి, ఎల్లయ్య, కిష్టయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శంగా ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు

- జిల్లాలో వంద శాతం ఫలితాలు సాధించిన 146 పాఠశాలలు
- వరుసగా 9వ సారి వంద శాతం సాధించిన జెడ్పీ అన్నాసాగర్ పాఠశాల


వంద శాతం ఫలితాలు సాధించిన వెల్లుట్ల జెడ్పీ పాఠశాల

ఎల్లారెడ్డిరూరల్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు ప్రభుత్వ గురుకుల పాఠశాలలు పదో తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమైననాటి నుంచి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఉపాధ్యాయులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నారు. ఎల్లారెడ్డి మండలంలో మూడు జెడ్పీ, ఒక గురుకుల పాఠశాలలో వంద శాతం ఫలితాలు జిల్లాలో ఈఏడాది పదోతరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణతను 146 పాఠశాలలు సాధించాయి. వీటిలో జిల్లా పరిషత్ పాఠశాలలు 71, ప్రైవేటు పాఠశాలలు 45, కేజీబీవీలు 11, బీసీ వెల్ఫేర్ 07, మైనార్టీ రెసిడెన్షియల్ 02, సోషల్ వెల్ఫేర్ 03, ట్రైబల్ వెల్ఫేర్ 02,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 03, మోడల్‌స్కూళ్లు 02 వంద శాతం ఫలితాలను సాధించాయి.

ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గత 9 ఏళ్లుగా వంద శాతం ఫలితాలను సాధిస్తోంది. ప్రధానోపాధ్యాయులు బదిలీ అయినప్పటికి అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. అన్నాసాగర్ జెడ్పీ పాఠశాలలో 2015వ సంవత్సరం నుంచి వరుసగా వంద శాతం ఫలితాలు సాధిస్తున్నారు. వీరితో పాటు మండలంలోని వెల్లుట్ల జెడ్పీ పాఠశాల సైతం వరుసగా రెండోసారి పదో తరగతిలో వంద శాతం ఫలితాలను సాధించింది. గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు సైతం వంద శాతం ఫలితాలను సాధించారు. ప్రతి పాఠానికి సంబంధించిన అంశాలను రోజు వారీగా స్లిప్ టెస్టులు పెట్టి పాఠానికి సంబంధించిన జవాబులు నేర్చుకునేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రాత్రి పది గంటల వరకు చదవడంతో పాటు ఉదయం 5 గంటలనే నిద్ర లేచే వేకప్ కాల్ విధానంతో విద్యార్థులకు చదువుపై ఆసక్తిని కలిగిస్తున్నారు.

ప్రత్యేక తరగతులు ఉపయోగపడ్డాయి



పాఠశాలలో ఉదయం, సాయంత్రం సమయాలలో పదో తరగతికి ప్రత్యేక తరగతులను నిర్వహించేవారు.దీంతో పాఠశాల ముగిసిన తరువాత చదువుకునేందుకు సమయం దొరికేది. పాఠాలకు సంబంధించిన సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేశారు. దీంతో మంచి మార్కులను సాధించాను. – అమూల్య, జెడ్పీ పాఠశాల, అన్నాసాగర్

గ్రూపులుగా చేసి చదివించే వారు



విద్యార్థులను గ్రూపులుగా చేసి చదివించే వారు. ప్రతి గ్రూపులో ఏబీసీ కేటగిరిలకు చెందిన విద్యార్థులు ఉండే వారు. చదువులో వెనకబడిన వారితో పాఠాలను డిస్కస్ చేయడంతో వారికి సైతం చదువుపై ఆసక్తి కలిగేది. అందరితో కలిసి చదవడం వలన మంచి మార్కులను సాధించాను. – ప్రవళిక, జెడ్పీ పాఠశాల, వెల్లుట్ల

విద్యార్థులకు వేకప్ కాల్ చేసే వాళ్లం



పదో తరగతి విద్యార్థులకు ఉదయం 5గంటలకు వేకప్ కాల్ చేసేవాళ్లం. రాత్రి 10 గంటల తరువాత ఫోన్ చేసి చదివారా, పడుకున్నారా ఇలా ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల వివరాలను తెలుసుకునే వారు. ముఖ్యమైన ప్రశ్నలను తెలిపి వాటిని చదువుకునేలా చేసేవాళ్లం. -వెంకటేశ్వర్‌రావు,ప్రిన్సిపల్,జెడ్పీ పాఠశాల, వెల్లుట్ల

విద్యార్థులను దత్తత తీసుకునే వారు



పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడు పదో తరగతిలోని కొంత మంది విద్యార్థులను దత్తత తీసుకునేవారు. వీరు రోజు విద్యార్థులతో పాటు ఇతర విద్యార్థులు ఎలా చదువుతున్నారనే విషయాలను గమనించే వారు. రోజు స్లిప్ టెస్టులుపెట్టి వందశాతం ఫలితాలు సాధించాం. -విఘ్నేశ్వర్‌రెడ్డి,ప్రిన్సిపల్, జెడ్పీ పాఠశాల, అన్నాసాగర్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి


ప్రజావాణిలో ఓ దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 96 వినతులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 96 వినతులు వచ్చాయి. వాటిలో ఎక్కువగా భూ సమస్యలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతు భరోసా, పింఛన్లు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి లో వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచరాదన్నారు. వెంటనే పరిష్కరించడం గానీ, పరిష్కార మార్గాలు చూపడం గానీ చేయాలన్నారు. సాధ్యాసాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యలపై దరఖాస్తు దారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండేళ్లయినా అందని సీఎం రిలీఫ్ ఫండ్

- అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఓ కుటుంబం
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు


తన ఇద్దరు పిల్లలతో కుతాడి ఎల్లవ్వ

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఆర్‌బీ నగర్‌కి చెందిన కుతాడి ఎల్లవ్వది నిరుపేద కుటుంబం. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. ఎల్లవ్వకు 2022 లో నిత్యం బ్లీడింగ్ సమస్య రక్త హీనతతో పాటు బోన్ మ్యారో వ్యాధి వచ్చింది. భర్త కుతాడి ప్రశాంత్ హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించగా రూ.2.17 లక్షల వరకు ఖర్చు అయింది. దీంతో ఆకుటుంబం తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతుంది. ఎల్లవ్వ భర్త 2023 ఫిబ్రవరిలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేశాడు. ఇప్పటివరకు మంజూరు కాలేదు. స్థానిక ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి, ఉన్నతాధికారులను సైతం కలిసి విజ్ఞప్తి చేసిన ఇప్పటి వరకు సీఎంఆర్‌ఎఫ్ మంజూరు కాలేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి తమ ఆదుకోవాలని ఎల్లవ్వ భర్త ప్రశాంత్ కోరుతున్నాడు.

సన్న రకాలకు అందని బోనస్


బాన్సువాడలో ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు

- 57.445 ఎకరాల్లో సన్నరకం సాగు చేసిన రైతులు
- రైతులకు తప్పని ఎదురుచూపులు

బాన్సువాడ : జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణ ఊపందుకుంది. మరో వారం, పది రోజుల్లో కొనుగోళ్లు చివరి దశకు చేరనున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో ధాన్యంకు సంబంధించి డబ్బులు జమ అవుతున్నా..బోనస్ మాత్రం జమ కావడం లేదు. జిల్లాలో ఈ యాసంగిలో 2.61.110 ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇందులో సన్నరకాలు 57.445 ఎకరాల్లో సాగయ్యాయి. జిల్లాలో 1.32 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడులు వచ్చాయి. గత నెల ఏప్రిల్ మొదటి వారం నుంచే జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాన్సువాడ డివిజన్‌లోనే మొదటగా వరి నాట్లు వేస్తారు. కొనుగోళ్లు కూడా ముందే ప్రారంభించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా సన్న, దొడ్డు రకాలకు సంబంధించి 2.06.750 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి రైతుల ఖతాల్లో రూ. 310 కోట్లు జమ చేశారు. సన్నరకం ధాన్యానికి ఇప్పటికి బోనస్ చెల్లించకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి సన్నరకం విక్రయించిన రైతులకు బోనస్ చెల్లించాలని కోరుతున్నారు.

రాని బోనస్ డబ్బులు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాం. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో చాల మంది రైతులు సన్నరకం ధాన్యం పండించారు. ధాన్యంకు సంబంధించిన డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయి. బోనస్ డబ్బులు మాత్రం పడలేదు.
-వెంకటి రైతు,బాన్సువాడ

బోనస్ ఇస్తామంటేనే సన్నరకం సాగు చేశాం

ధాన్యంకు సంబంధించిన డబ్బులతో పాటే బోనస్ ఖాతాల్లో జమ చేయాలి. ధాన్యం కొనుగోళ్లు పూర్తియ్యాయి. కానీ బోనస్ గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. బోనస్ ఇస్తామంటేనే సన్నరకం వడ్లు సాగు చేశాం. -సాయిలు రైతు,బాన్సువాడ

యూరియా తక్కువగా వాడాలి

వర్ని(మోస్రా): తక్కువ యూరియాను వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మంజు భార్గవి సూచించారు. సోమవారం మోస్రాలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అవగాహన సదస్సు నిర్వహించారు.

ఉబ్బసంతో ఉక్కిరిబిక్కిరి

- జాగ్రత్తలు పాటిస్తే ఉపశమనం
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

వాతావరణంలోని అలర్జీ కలిగించే పదార్థాల కారణంగానో.. వంశపారంపర్యంగానో వచ్చే ఉబ్బసం(ఆస్తమా) వ్యాధి మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఊపిరి తీసుకోవడం కష్టతరమవుతోంది. దీంతో రోజూవారీ జీవితం ప్రభావితమవుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం లేనప్పటికీ.. సమర్థవంతమైన చికిత్స, మందుల వాడకంతో సంతృప్తికరంగా జీవించొచ్చని ప్రముఖ పల్మనాలజిస్టు రాజేంద్రప్రసాద్ తెలిపారు. నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..
– నిజామాబాద్ నాగారం

జిల్లాలో ఆస్తమా బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. ఆస్తమా వాయునాళాలకు సంబంధించిన వ్యాధి. నాళాలకు వాపు రావడంతో జిగురుగా ఉండే పదార్థం(శ్లేష్మం) తయారవుతుంది. దీంతో ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు ఏర్పడతాయి. దుమ్ము, పుష్పాల దూళి, గాలి కాలుష్యం, పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయనాలు, చల్లటి, పొడి గాలులు ఆస్తమా బారిన పడేందుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. కొంతమందిలో ఆస్తమా వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉంటుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు.

గుర్తించండి ఇలా..
సాధారణ పనులు, వ్యాయామం చేయడంలో ఇబ్బందులు ఏర్పడుతాయి. ఛాతి బిగపట్టినట్లు ఉంటుంది. విపరీతంగా దగ్గు వస్తుంది. నడిచినా, మెట్లెక్కినా త్వరగా అలసిపోతారు.

వ్యాధిగ్రస్తులకు జాగ్రత్తలు..
పొగ తాగడం మానేయాలి. ఇతరులు తాగితే దూరంగా ఉండాలి. దుమ్ము, ధూళి, చల్లని ప్రదేశాల్లో సంచరించొద్దు. పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి. విటమిన్ 'డి' సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి.



ఏం తినాలి? ఏం తినొద్దు?
విటమిన్ 'ఏ' ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి.ప్రధానంగా క్యారెట్లు, పాలకూర, చిలగడదుంప, చేప, పాల ఉత్పత్తులు, గుడ్లు తినాలి. మాంసం, చీజ్, ఐస్‌క్రీమ్, పాలకొవ్వు వంటి సంతృప్త ఆమ్లాలను నివారించాలి. వీటితో వాపు పెరిగి ఇబ్బందులు కలుగుతాయి. కొబ్బరి నూనె, పామ్‌ఆయిల్‌తో చేసిన ఆహారంతో ఆస్తమా పెరిగే అవకాశం ఉంటుంది.

భయపడొద్దు..



ఆస్తమా అనేది దీర్ఘకాలిక వ్యాధి. భయపడాల్సిన అవసరం లేదు. వైద్యుల సలహాలు, సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహార నియమాలు పాటిస్తే వ్యాధిని తరిమికొట్టవచ్చు. వైద్యులు సూచించిన మందులతోపాటు ఇన్హేలర్ వాడాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. దుమ్ము, ధూళి, చల్లని ప్రదేశాల్లో తిరుగొద్దు.
– డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్, ప్రముఖ పల్మనాలజిస్ట్

క్రైం కార్నర్

కారు, ఆటో ఢీ.. పలువురికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్ హుస్సేన్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గేట్ వద్ద సోమవారం రాత్రి కారు, ఆటో ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన కార్గం మల్లేశ్ తన కుమారుడు తిరుపతితోపాటు ఏర్రారం గ్రామానికి చెందిన కాశీ జగ్జీవన్‌తో కలిసి కారులో గోపాల్‌పేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మెదక్ జిల్లా గోమారం గ్రామానికి చెందిన యండీ హుస్సేన్ తన తల్లి ఖాసీంబీ, సోదరి ఫాతిమాతో కలిసి ఎల్లారెడ్డి నుంచి మెదక్ వైపు వెళ్తున్నారు. కారు, ఆటో తాండూర్‌గేట్ సమీపంలో ఒకదానికొకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఆటో నడుపుతున్న హుస్సేన్‌తోపాటు ప్రయాణిస్తున్న ఖాసీంబీ, ఫాతిమా, కారులో ఉన్న మల్లేశంకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీకొన్న ఆటో

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామ శివారులో సోమవారం ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మేస్త్రీలు ఆటోలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు బయల్దేరారు. సుల్తాన్‌నగర్ శివారులో ఆటో అదుపుతప్పి చెట్టును బలంగా ఢీకొట్టింది. క్షతగాత్రులను స్థానికులు 108 అంబులెన్స్‌లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

ఆటోను ఢీకొన్న బైకు
ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఆటోను బైక్ ఢీకొట్టినట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన సాయిలు తన కుటుంబ సభ్యులతో బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డికి ఆటోలో వస్తుండగా విక్రమ్ అనే వ్యక్తి బైకును అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ తిమ్మారెడ్డి శివారులో ఆటోను ఢీకొట్టాడు. దీంతో ఆటో డ్రైవర్ సాయిలుకు గాయాలయ్యాయి. సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులకు జరిమానా

బోధన్‌టౌన్(బోధన్): ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ల తల్లిదండ్రులకు బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్పసాయి జరిమానా విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా ఐదుగురు బాలురు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారి వివరాలు సేకరించి తల్లిదండ్రులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులతోపాటు తల్లిదండ్రులపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫేక్ కాల్ చేసిన ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్‌లో బాంబు పెట్టినట్లు ఫేక్ కాల్ చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. ఈ నెల 2న రాత్రి 7.41 గంటలకు రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్లు డయల్ 100కు కాల్ వచ్చిందన్నారు. వెంటనే డాగ్ స్క్వాడ్, బీడీ టీం, సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో అన్ని ప్రాంతాలను పరిశీలించి ఫేక్ కాల్‌గా గుర్తించామన్నారు. డయల్ 100కి కాల్ చేసిన వ్యక్తిని రంగారెడ్డి జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన శ్రీమంత్ గౌడ్‌గా గుర్తించి, పట్టుకున్నట్లు తెలిపారు. వ్యక్తిగత సమస్యలుండడంతో ప్రజలను భయాందోళనకు గురి చేసి హింసను ప్రేరేపించాలని దురుద్దేశంతో కాల్ చేశానని విచారణలో వెల్లడైందన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

వామ్మో.. ఎంత పెద్ద పాము



రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి గ్రామ శివారులో ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశంలో సోమవారం తాటి జెర్రి పాము ప్రత్యక్షమైంది. పామును చూసిన ఉపాధి కూలీలు భయాందోళనకు గురయ్యారు. హన్మయ్య అనే వ్యక్తి చాకచాక్యంగా పామును చంపివేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పాము పొడవు పది ఫీట్ల వరకు ఉంటుందని ఉపాధి కూలి సాయన్న తెలిపారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు


ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని సన్మానిస్తున్న తిప్పాపూర్ గ్రామస్తులు

భిక్కనూరు: నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చెప్పారు. సోమవారం మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ప్రాణహిత చేవెళ్ల పథకం ద్వారా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 23 కోట్లను మంజూరు చేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న పలు సమస్యలను షబ్బీర్ అలీకి వివరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం ఉప అధ్యక్షులు కుంట లింగారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ స్వామి, వీడీసీ అధ్యక్షుడు కొండ సిద్ధ రాములు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ధర్మయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

- బంగారం, వెండి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అశోక్

బాన్సువాడ : బాన్సువాడలో జరిగిన చోరీ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. గత నెల 19న పట్టణంలోని సంగమేశ్వర కాలనీకి చెందిన చెనంగారి లక్ష్మి ఇంటికి తాళం వేసి అత్త సాయవ్వ, ఆడబిడ్డ రాణిలతో కలిసి ఇంటిపైన నిద్రించారు. బోర్లం క్యాంపు తండాకు చెందిన నేనావత్ ఈశ్వర్ తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న బంగారు నగలు, వెండి, నగదును ఎత్తుకెళ్లాడు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని గాంధీచౌక్‌లో ఈశ్వర్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టుకొని విచారించడంతో తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడన్నారు. నిందితుడి నుంచి 6 తులాల బంగారం, 86 తులాల వెండి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఈశ్వర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులో చాకచక్యంగా పనిచేసిన కానిస్టేబుల్ అశోక్ హోంగార్డు హేమాద్రిని సీఐ అభినందించారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామానికి చెందిన క్రీస్తుమణి (24) అనే మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు సోమవారం తెలిపారు. ఆమెకు గతంలో వివాహం జరిగినా కుటుంబ సమస్యలతో చాలా రోజులుగా ఉగ్రవాయిలోని తల్లిగారింటివద్దనే ఉంటోంది. ఈ నెల 4న కూరగాయలు తీసుకువస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. తల్లి దాసరి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం
ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన నిధారాణి (15) అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన నిధారాణి ఆచూకీ కోసం బంధువుల ఇళ్లు, ఇతర చోట్ల వెతికినా లభించలేదని, తల్లి దేవావత్ భాను ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.